సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 20 । ఏప్రిల్ । 2025



సోమశిలలో 51.930 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం 51.930 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.98,510
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.8,945
3శాతం జీఎస్టీతో	రూ.9,213
నవర (8గ్రా)	రూ.73,704

గరిష్టం/కనిష్టం

39.5 /28.5

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆదివారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 61 శాతంగా నమోదైంది.

కూటమి కుతంత్రం

- రుస్తుం మైనింగ్ కేసులో ఏ5గా కృష్ణంరాజు
- బహిరంగంగా తిరుగుతున్నా అతని అరెస్ట్ విషయంలో పోలీస్ శాఖ వెనుకడుగు
- నిందితుడికి గనుల సిండికేట్ అండ
- ఏ4గా ఉన్న కాకాణి అరెస్ట్ కోసం మాత్రం 50 మంది పోలీసులకు ప్రత్యేక విధులు
- ఇదేమి న్యాయమంటున్న రాజకీయవర్గాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అధికార యంత్రాంగం పక్కాగా అమలు చేస్తోంది. అధికార పార్టీ ఎమ్మెల్యేలు చెప్పిందే వేదంగా భావిస్తున్న అధికారులు వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేస్తూ అక్రమ కేసుల్లో ఇరికిస్తున్నారు. పోలీసులు కూడా నిజానిజాలు తెలుసుకోకుండానే కేసులు బనాయిస్తూ ప్రతిపక్ష నేతలను ముప్పతిప్పలు పెడుతున్నారు. పొదలకూరు మండలంలోని తాటిపర్తి రుస్తుం మైన్స్‌లో అక్రమ మైనింగ్ జరిగిందంటూ పది మందిని నిందితులుగా చేర్చిన పోలీసులు అరెస్ట్‌ల విషయంలో పచ్చపాతం చూపిస్తున్నారు. దమ్ముంటే అరెస్ట్ చేయండి చూద్దామంటూ ఆ కేసులో ఉన్న పచ్చ నేత పోలీస్ శాఖకే సవాల్ విసురుతున్నాడు.



జరిగింది ఇది..

రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో పాటు ఎమ్మెల్యే సోమిరెడ్డి అవినీతి, అక్రమాలపై నిత్యం ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని టార్గెట్ చేసి అక్రమ కేసుల్లో ఇరికించారు. రుస్తుం మైన్స్‌లో అక్రమ మైనింగ్ జరిగిందంటూ అందులో పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, వాకాటి శివారెడ్డి, వాకాటి శ్రీనివాసులరెడ్డిల ప్రమేయం ఉందని మైనింగ్ డీడీ బాలాజీ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు నెలల క్రితం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ ముగ్గురికి న్యాయస్థానం ముందస్తు బెయిల్ ఇచ్చింది. ఎఫ్ఐఆర్ నమోదైన నెల రోజుల అనంతరం నాన్ బెయిలబుల్ సెక్షన్లుగా మార్పు చేసి తాజాగా కుట్ర కోణం, ధ్వంసం చేయడం, బెదిరించడం, అక్రమంగా ప్రవేశించడం, దొంగతనం చేసినట్లుగా వివిధ రకాల సెక్షన్లతో 120(బీ), 447, 427, 379, 290, 506, 109, ఆర్/డబ్ల్యూ 34 బీఎన్ఎస్ సెక్షన్లు మెమో దాఖలు చేశారు. నిందితుల్లో ఏ1గా పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, ఏ2గా వాకాటి శివారెడ్డి, ఏ3గా వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఏ4గా కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఏ5గా గుంటమడుగు కృష్ణంరాజు, ఏ6గా వేమిరెడ్డి అరవింద్‌కుమార్‌రెడ్డి, ఏ7గా కరుణాకర్‌రెడ్డి, ఏ8గా కొండా శివారెడ్డి, ఏ9గా కుందేటి హనుమంతరావు, ఏ10గా మోలబంటి శేఖర్‌బాబులను చేర్చారు. ఇప్పటికే ఏ6, ఏ7, ఏ8గా ఉన్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపారు.

మైనింగ్ వ్యాపారికి మినహాయింపు

రుస్తుం మైనింగ్ కేసులో ఏ5 గా ఉన్న గుంటమడుగు కృష్ణంరాజు జిల్లాలోనే తిరుగుతూ పోలీస్ శాఖకు దమ్ముంటే అరెస్ట్ చేయండి చూద్దామంటూ సవాల్ విసురుతున్నారు. సైదాపురం మండల టీడీపీ మాజీ అధ్యక్షుడిగా ఉన్న కృష్ణంరాజు మైనింగ్ వ్యాపారంలో దిట్ట. ఒకప్పుడు సామాన్య వ్యక్తిగా ఉన్న ఆయన ప్రస్తుతం రూ.వందల కోట్ల ఆస్తిపరుడు. మైకా క్వార్ట్జ్ ఎక్స్‌పోర్టర్‌గా ఉన్న కృష్ణంరాజును వ్యాపారంలో పావుగా వాడుకునేందుకు ప్రస్తుతం మైనింగ్ సిండికేటే ఈ కేసులో ఇరికించిందన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ఆయన టీడీపీ నేతగా ఉండడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వ్యాపారం విస్తరించాడు. అనధికార మైనింగ్‌తో చెలరేగిపోయాడు. ఈ క్రమంలో ఇది కూటమి సిండికేట్‌కు నచ్చకపోవడంతో కేసులో నిందితుడిగా చేర్పించారనేది ప్రచారం. మైకా క్వార్ట్జ్ ఎక్స్‌పోర్టర్‌గా విదేశీయులతో సైతం పరిచయాలు, వ్యాపార అనుభవం ఉన్న వ్యక్తి కావడంతో అతని ద్వారా తమ కార్యకలాపాలు చక్కబెట్టుకునేందుకు ఆయన్ను పావుగా వాడుకుంటున్నారు. దీంతో కేసులో ఏ5గా ఉన్న టీడీపీ నేత కొన్ని రోజులపాటు అజ్ఞాతంలో ఉన్నప్పటికీ మైనింగ్ సిండికేట్ అతన్ని అరెస్ట్ చేయకుండా పోలీస్ శాఖతో ఒప్పందం చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. పోలీస్ శాఖ హామీతోనే ఆయన బహిరంగంగానే తిరుగుతున్నాడన్న ప్రచారం లేకపోలేదు.

కాకాణి విషయంలో..

రుస్తుం మైనింగ్ కేసులో ఏ4 ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అరెస్ట్ చేసేందుకు దాదాపు 20 రోజులుగా ఆరు పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. వివిధ రాష్ట్రాలలో జల్లెడ పడుతున్నాయి. దాదాపు 50 మంది పోలీసులు రూ.లక్షల్లో ఖర్చు చేసుకుంటూ తిరుగుతున్నారు. ఆయన అరెస్ట్ కోసం పోలీస్ శాఖ చూపే ఉత్సాహం.. ఏ5గా ఉన్న వ్యక్తి సవాల్ విసురుతున్నా అరెస్ట్ చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. ఈ విషయంపై నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన మాట దాటేయడం విశేషం.

న్యూస్‌రీల్

డీసీపల్లిలో 524 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 524 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 745 బేళ్లు రాగా 524 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 68174.7 కిలోల పొగాకును విక్రయించగా రూ.17928524.40 వ్యాపారం జరిగింది. కిలో గరిష్ట ధర రూ.280 కాగా, కనిష్ట ధర రూ.220 లభించింది. సగటు ధర రూ.262.98గా నమోదైంది. వేలంలో 11 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్యారేజీ పెండింగ్ పనులకు ప్రతిపాదనలు పంపండి



బ్యారేజ్ వద్ద పరిశీలిస్తున్న అధికారులు

సంగం: సంగం బ్యారేజీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు చీఫ్ ఇంజినీర్ వరప్రసాద్‌రావు, ఎస్ఈ దేశ్‌నాయక్ సూచించారు. శనివారం వారు బ్యారేజీని సందర్శించి మిగిలిన పనుల గురించి ఆరా తీశారు. అవి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈలు అనిల్ కుమార్‌రెడ్డి, నాగరాజు, డీఈలు విజయరామిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పెంచలయ్య, ఏఈలు వినయ్, మల్లికార్జున, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

బయో మైనింగ్ యూనిట్ ప్రారంభం



బయో మైనింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు సిటీ: జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఏర్పాటు చేసిన బయో మైనింగ్ యూనిట్‌ను మంత్రి నారాయణ శనివారం స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌లో చెత్తను ఈ ప్రక్రియ ద్వారా వేరు చేయడం సాధ్యపడుతుందన్నారు. అనంతరం అల్లీపురం డంపింగ్ యార్డ్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌కుమార్‌రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చైర్మన్ కృష్ణయ్య, కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ నందన్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు నగర కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



వాహన చోదకులను తనిఖీ చేస్తున్న బాలాజీనగర్ సీఐ సాంబశివరావు

నెల్లూరు (క్రైమ్): నేర నియంత్రణ చర్యల్లో భాగంగా పోలీసులు నగరంలో తనిఖీలు ముమ్మరం చేశారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారు జాము వరకు ప్రధాన కూడళ్లతోపాటుగా జాతీయ రహదారి ప్రవేశ, నిష్క్రమణ, శివారు ప్రాంతాల్లో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులు, నంబరు ప్లేట్లు లేని వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్లకు తరలించారు. మద్యం మత్తులో నేరాలు, ప్రమాదాలు జరుగుతుండడంతో అన్ని కూడళ్లల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి నిబంధనలు పాటించని వాహనదారులపై భారీగా జరిమానాలు విధిస్తున్నారు. బహిరంగంగా మద్య సేవనం చేస్తున్న మందుబాబులపై కేసులు నమోదు చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వేలి ముద్రలను పోలీసు డేటాబేస్‌తో పరిశీలించడంతోపాటు పూర్తి స్థాయిలో విచారిస్తున్నారు. పోలీసు అధికారులు మాట్లాడుతూ పాతనేరస్తులు, రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెంచామన్నారు. నేర నియంత్రణకు తాము తీసుకుంటున్న చర్యలకు నగర ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ తనిఖీల్లో చిన్నబజారు, సంతపేట, దర్గామిట్ట, బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, దశరథరామారావు, రోశయ్య, కె.సాంబశివరావు, ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీచరు పాడుబుద్ధి

- ఓ మహిళ పట్ల అసభ్య ప్రవర్తన
- దేహశుద్ధి చేసి.. పోలీసులకు ఫిర్యాదు
- కేసు నమోదు కాకుండా తమ్ముళ్ల వత్తాసు
- ముడుపులతో కేసు రాజీ చేసిన వైనం

సాక్షి టాస్క్‌ఫోర్స్: పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తి చేస్తూ కామంతో కళ్లు మూసుకుపోయి ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించాడో ప్రబుద్ధుడు. ఆమె బంధువులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించగా అధికార పార్టీ నేతల అండదండలతో పోలీసులు కేసు రాజీ చేసిన వైనం ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. వింజమూరులో ఇటవల శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు జరిగాయి. కల్యాణోత్సవం సందర్భంగా పోలీస్‌స్టేషన్ సమీపంలోని కల్యాణమండం వద్ద రాత్రి పాట కచ్చేరి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వస్తున్న మహిళతో కీచక ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించడంతో భయపడి కేకలు వేసింది. దీంతో సమీపంలోని ఇళ్లలో ఉన్న పలువురు మహిళలు వచ్చి ఆ ఉపాధ్యాయుడికి చీవాట్లు పెట్టారు. ఈ ఘటనపై బాధిత మహిళ తన సోదరులతోపాటు భర్తకు చెప్పింది. వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిళ భర్త సదరు ఉపాధ్యాయుడిని ఓ పెట్రోల్ పంపు వద్ద నిలదీసి దేహశుద్ధి చేశాడు. దీంతో వివాదం పోలీస్‌స్టేషన్‌కు రాగా అధికార పార్టీకి చెందిన సదరు ఉపాధ్యాయుడి బంధువులు రంగ ప్రవేశం చేసి, కేసు నమోదు కాకుండా ఒత్తిళ్లు చేశారు. బాధిత మహిళ భర్త పోలీస్ డిపార్టుమెంట్‌లో విధులు నిర్వహిస్తుండంతో ఆయనపై కూడా అధికారుల నుంచి ఒత్తిడి తెచ్చి రాజీకి ఒప్పించారు. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో ముడుపులు చేతులు మారినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం సదరు ఉపాధ్యాయుడిని స్టేషన్‌కు పిలిపించి ఆ మహిళకు ఎస్సై సమక్షంలో సారీ చెప్పించి ఫిర్యాదు వాపసు తీసుకునేటట్లు చేసినట్లు సమాచారం.



డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న సీహెచ్‌ఓలు

సీహెచ్‌ఓల నిరసన

నెల్లూరు (క్రైమ్): ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సీహెచ్‌ఓలు) శనివారం నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ సీహెచ్‌ఓలకు ప్రభుత్వం కల్పించే ప్రోత్సాహకాలు నేటి వరకు ఇవ్వకపోవడంతో తాము ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈపీఎఫ్‌ఓను పునరుద్ధరించాలని, భవనాల అద్దెతోపాటు విద్యుత్ బిల్లులు చెల్లించాలని కోరారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాను, మహేష్, తిరుమలయ్య, రబేకా, జ్యోతి, శివ, లావణ్య, కృష్ణ వేణి తదితరులు పాల్గొన్నారు.

కరిగిపోతున్న ఉప్పు రైతు బతుకు





➡ ఈ ఫొటోలో ఉన్న ఉప్పు రైతు పేరు గోళ్ల శీనయ్య. అల్లూరు మండలం గోగులపల్లి. ఆయన రెండెకరాల్లో మడులు ఏర్పాటు చేసి ఉప్పు సాగు చేస్తే, రూ.లక్ష వరకూ ఖర్చయింది. గతంలో ఎకరాకు రూ.10,000 పెట్టుబడి పెడితే, రూ.50,000 లాభం వచ్చేది. ఇప్పుడు పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి కనిపించడంలేదని వాపోతున్నాడు.

ఉప్పు రైతులు నవమాసాలు కష్టపడినా.. నాలుగు రూపాయలు మిగులు కనిపించని పరిస్థితి. ఆ భూముల్లో ఉప్పు తప్ప మరే పంట సాగు చేసే అవకాశం లేకపోవడంతో దాన్నే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఉప్పు రైతులను దళారులు ధరల్లోనూ, కాటాల్లోనూ మాయ చేసి దోచుకుంటున్నారు. మార్కెట్లో కల్లు ఉప్పు కేజీ రూ.15 నుంచి రూ.20 విక్రయిస్తున్నారు. రైతుల దగ్గర కేవలం రూ.2లకే కొనుగోలు చేస్తున్నారు. గతంలో పెద్ద పెద్ద కమతాల్లో ఉప్పు సాగు చేసే రైతులు ఇప్పుడు ఎకరం.. రెండెకరాలకు పరిమితం అయ్యారు.

ప్రతి సీజన్‌లో 5 వేల ఎకరాల్లో సాగు

- ఎకరానికి 40 టన్నుల ఉత్పత్తి
- ఖర్చు రూ.50 వేలు
- ప్రస్తుతం టన్ను ధర రూ.2,100
- చాకిరీ తప్ప మిగులు లేదంటున్న రైతులు



ఉప్పు పండించే మడులు

కావలి: జిల్లాలో సంప్రదాయ ఉప్పు ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతోంది. పెరుగుతున్న ఖర్చులు, తగ్గుతున్న ధరలతో పోటీపడలేక ఉప్పు కొటారులు.. బీళ్లుగా వదిలేస్తున్నారు. ప్రధానంగా జిల్లాలో అల్లూరు మండలం గోగులపల్లి, ఇస్కపల్లి, విడవలూరు మండలం రామతీర్థం, ముత్తుకూరు గ్రామాల్లోనే దాదాపు 10 వేల ఎకరాల్లో ఉప్పు ఉత్పత్తి జరిగేది. కాలక్రమేణ ఈ విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం ముత్తుకూరు మండలంలో ఐదు నుంచి పది ఎకరాల్లోనే ఉప్పు ఉత్పత్తి జరుగుతుండగా, అల్లూరు, విడవలూరు మండలాల్లో మాత్రం దాదాపు 5 వేల ఎకరాల్లో ఉప్పు పండిస్తున్నారు. 7 వేల మంది రైతులు, 5 వేల మంది కూలీలు ఉప్పు సాగుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

9 నెలలు కష్టపడినా..

సాధారణంగా ఉప్పు సాగుకు డిసెంబర్ నుంచి సమాయత్తం అవుతారు. ఫిబ్రవరి చివరి నుంచి ఉత్పత్తిని ప్రారంభిస్తారు. ఆగస్టు వరకు ఉప్పు పంట సాగులో రైతులు బిజీబిజీగా ఉంటారు. ఒక ఎకరం స్థలంలో 40 నుంచి 60 మడులను తయారు చేసి సాగు చేపడతారు. ఒక్కో మడి నుంచి వారం.. పది రోజులకొకసారి 40 నుంచి 50 కేజీల ఉప్పు ఉత్పత్తి వస్తుంది. దాదాపు 9 నెలల పాటు ఎకరం భూమి నుంచి 40 టన్నుల వరకు ఉప్పును పండిస్తున్నారు. ప్రస్తుత ధరల ప్రకారం చూస్తే ఎకరానికి రూ.85 వేల నుంచి రూ.90 వేలు రాబడి వస్తుంది. ఇందులో పెట్టుబడి వ్యయం పోను ఎకరానికి కనీసం పాతిక వేలు కూడా మిగులు లేని దయనీయ పరిస్థితి.

దళారులదే రాజ్యం

ఉప్పు తయారీకి ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుంది. ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టేందుకు స్తోమత లేకపోవడం, బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడం వంటి ఆర్థిక పరిస్థితుల నేపథ్యం ఉప్పు రైతులను వెంటాడుతున్నాయి. దీంతో దళారులు వద్ద అప్పులు చేసి సాగు ప్రారంభించే ఉప్పు రైతులు, పంట వచ్చిన తర్వాత అదే దళారులు చెప్పిందే ధరకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి అనివార్యం అవుతోంది. సాగు చేసిన ఉప్పును దళారులు, వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు కొట్టున్నా.. ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ఉప్పు రైతు దగా పడుతున్నాడు.

ఈ ఏడాది ధరలు పతనం

ఈ ఏడాది ఉప్పు సాగుకు ముందే ధరలు పతనమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో క్వింటా రూ.390 నుంచి రూ.500 వరకు కొనుగోలు చేశారు. గతేడాది కూడా క్వింటా రూ.320లకు కొనుగోలు చేస్తే.. ప్రస్తుతం రూ.210 నుంచి రూ.240లకే కొనుగోలు చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం తమిళనాడు ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా ప్రతి కార్డుదాడికి కల్లు ఉప్పును సరఫరా చేస్తోంది. ఈ క్రమంలో అక్కడి డిమాండ్‌కు తగిన స్థాయిలో ఉప్పు ఉత్పత్తి లేకపోవడంతో జిల్లాలో పండిన ఉప్పు తమిళనాడుకు ఎక్కువ స్థాయిలో ఎగుమతి జరుగుతుండగా, కొంత మేర ప్రధాన నగరాలు, పట్టణాలు, కర్ణాటకకు రవాణా జరుగుతోంది. రిటైల్ మార్కెట్‌లో ఉప్పు కేజీ రూ.20 వరకు ఉంది. కానీ రైతులకు రూ.2 నుంచి రూ.3 మాత్రమే చెల్లిస్తున్నారు.

కూలీలను పెట్టుకోవడం కూడా భారమే

ఉప్పు కొటారుల్లో కూలీలుగా పని చేసే వారికి పనిని బట్టి రోజుకు రూ.300 నుంచి రూ.500 ఇస్తుంటారు. ఉప్పు ధరలు ఘోరంగా పతనం కావడంతో రైతులు కూలీలను పనులకు పిలవడం లేదు. ఓపిక ఉన్నంత మేరకు రైతులే పనులు చేసుకుంటున్నారు. ఉప్పు తయారీపై ఆధారపడిన కార్మికులు ఇతర పనులకు వలసలు వెళ్తున్నారు.

ఆదుకోని ప్రభుత్వం

ఇప్పటి వరకు ఉప్పు సాగును పంటగా ప్రభుత్వం గుర్తించలేదు. సాయం అందడం లేదు. పెట్టుబడి కోసం దళారుల వద్ద అప్పులు చేస్తున్నారు. అదే వ్యాపారులు పంటను నచ్చిన ధరకు తీసుకుంటున్నారు. మద్దతు ధర అడిగితే అప్పులు తీర్చమని ఒత్తిడి చేస్తున్నారు. ఇలా దళారుల దందా, తూకాల్లో మోసాలు, వడ్డీ వ్యాపారుల ఆగడాలతో ఉప్పు రైతుల కష్టార్జితం దోపిడీ అవుతూనే ఉంది.



➡ ఈ ఫొటోలో ఉన్న ఉప్పు రైతు పేరు మాదం శ్రీకాంత్. అల్లూరు మండలం గోగులపల్లి. ఒకటిన్నర ఎకరాలో ఉప్పు సాగు చేస్తే, ధరలు దారుణంగా పడిపోయాయని తెలుసుకొని బావురమంటున్నాడు. కూలీలను కూడా పెట్టుకోకుండా, కుటుంబ సభ్యులతోనే ఉప్పు సేద్యం పనులు చేసుకుంటున్నాడు. ఇంటిల్లిపాది రెక్కల కష్టం తప్ప ఫలితం లేదంటున్నాడు.

నిల్వ చేసుకొనే అవకాశం లేక



ఉప్పును నిల్వ చేసుకోవడానికి ఎలాంటి వసతులు లేవు. వర్షాలు, తుపాన్లు వస్తే ఉప్పును భద్రపరుచుకోవడానికి అవకాశాలు లేవు. ఉప్పు కొటారుల వద్ద ఉన్న రోడ్ల వెంటే రాసులు పోసి ఉండడంతో అవి కరిగిపోతుంటాయి. రంగు కూడా మారిపోతోంది. దీంతో ఉప్పును మడులు నుంచి బయటకు తీయగానే అమ్మేస్తుంటాం. పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. ధరలు ప్రోత్సాహకంగా ఉండడం లేదు.

– వాసు, ఉప్పు రైతు, ఇస్కపల్లి గ్రామం, అల్లూరు మండలం



➡ ఈ ఫొటోలో ఉన్న ఉప్పు రైతు కూలీ పేరు రమణమ్మ. ఉప్పు పొలాల్లో వ్యాపారస్తుల కోసం కూలీ పని చేస్తుంది. కేజీ ప్యాకెట్లను ప్యాక్ చేస్తుంది. 25 ప్యాకెట్లను ప్యాకెట్ చేసి, వాటిని ఒక బస్తాలో వేసి సీల్ వేస్తే ఆమెకు రూ.9 కూలి ఇస్తారు. రోజుకు ఎన్ని బస్తాలు తయారు చేస్తే అన్ని రూ.9 కూలీ. ఆమె రోజుకు 25 బస్తాలు ప్యాక్ చేయడంతో రూ.225 కూలి దక్కుతోంది.

దళితుల భూములు కాజేశారు

- నాలుగు రోజుల్లోనే రెవెన్యూ రికార్డుల తారుమారు
- అధికారుల అండతోనే జరిగిందని ఆరోపణలు

అనుమసముద్రంపేట: దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూములను కొందరు రెవెన్యూ అధికారుల అండతో రికార్డులు మార్చేసి కాజేశారు. రెండు దశాబ్దాలుగా తమ పేరుతో ఉన్న భూములకు సంబంధించి నాలుగు రోజుల్లోనే హక్కుదారులుగా వేరే వారి పేర్లు నమోదు చేయడం వెనుక రెవెన్యూ అధికారులకు భారీగానే ముడుపులు ముట్టాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బాధితుల సమాచారం మేరకు 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దళితులకు భూములు పంపిణీ చేశారు. అందులో భాగంగా మండలంలోని అనుమసముద్రం సర్వే నంబరు 676లో కొంత మంది దళితులకు ఎకరా చొప్పున ఇచ్చారు. సదరు దళితులు మెట్ట పంటలను సాగు చేసుకుంటున్నారు. నాలుగు రోజుల క్రితం రికార్డుల్లో పేర్లు తారుమారు చేశారని ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని దళిత కాలనీకి చెందిన సోమవరపు సుమతి, భీమగుంట సుజాతమ్మ, వారణాసి సుగుణమ్మ, పాణెం చిన్నమ్మలకు చెందిన 4 ఎకరాల భూమిని బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన తిమ్మల రామచంద్రయ్య పేరుతో రికార్డుల్లోకి ఎక్కింది. 20 ఏళ్లుగా ప్రభుత్వం ఇచ్చిన భూమిని సాగు చేసుకుంటుండగా భూమిని స్థానికేతరులైన ఇతరుల పేరుతో ఎలా మారాయని భూమి అనుభవదారులు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది ప్రమేయం లేకుండా నాలుగు రోజుల్లోనే సాధ్యం కాదంటున్నారు. మా భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో తమ పేరుతో మార్చకపోతే కార్యాలయం వద్ద సామూహిక ఆత్మహత్యలకు సిద్ధపడుతామని హెచ్చరించారు. ఈ విషయమై ప్రశ్నించేందుకు శనివారం భూ లబ్ధిదారులైన దళితులు తహసీల్దారు కార్యాలయం వద్దకు వెళ్లగా అక్కడ ఎవరూ లేకపోవడంతో తిరిగి వచ్చారు. జిల్లా అధికారులు స్పందించి వెంటనే దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వెబ్‌సైట్‌లో సీనియార్టీ జాబితా

నెల్లూరు (టౌన్): జోన్–3 పరిధిలోని నెల్లూరు, ప్రకాశం,గుంటూరు జిల్లాల్లోని స్కూల్ అసిస్టెంట్స్ (ప్రభుత్వం) నుంచి గ్రేడ్–2 హెడ్‌మాస్టర్ల పోస్టులకు విద్యాశాఖ వెబ్‌సైట్‌లో తాత్కాలిక సీనియార్టీ జాబితాను ఉంచినట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 22వ తేదీలోపు తగిన ఆధారాలతో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌లో 'నారాయణ' విజయకేతనం



నెల్లూరు (టౌన్‌): జేఈఈ మెయిన్స్‌ ఫలితాల్లో నారాయణ జూనియర్‌ కళాశాలల విద్యార్థులు విజయకేతనాన్ని ఎగురవేశారని విద్యాసంస్థల జనరల్‌ మేనేజర్‌ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను నగరంలోని కళాశాలలో శనివారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో జనరల్‌ కేటగిరీలో పూర్వజ్‌ 337, హేమంత్‌సాయి 815, మధుకిరణ్‌రెడ్డి 1021, భానురిషిక్‌ 1216, అఖిలేష్‌ 1415, సంతోష్‌ 2004, వెంకట ఆకాష్‌ 2091, యశ్వంత్‌ బాబీ 2417, సాయిశ్రీధన్‌రెడ్డి 2870, శశిజ్ఞాన కౌశిక్‌రెడ్డి 2950, ఆశ్రిత 3426, నరసింహతేజ 3651, వెంకటభరత్‌కుమార్‌రెడ్డి 4957 ర్యాంకులను సాధించారని వివరించారు.

'విశ్వసాయి' విజయదుందుభి



నెల్లూరు (టౌన్‌): జేఈఈ మెయిన్స్‌ ఫలితాల్లో విశ్వసాయి జూనియర్‌ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారని కళాశాల చైర్మన్‌ సత్యనారాయణ, వైస్‌ చైర్మన్‌ కృష్ణమోహన్‌ పేర్కొన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను మాగుంట లేఅవుట్లోని కళాశాలలో శనివారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో రామ్‌రుత్విక్‌ 208, శ్రావణ్‌కుమార్‌రెడ్డి 356 ర్యాంకులను సాధించారని వివరించారు. 57 మంది విద్యార్థులు ర్యాంకులను సాధించారన్నారు.

'కృష్ణచైతన్య' సత్తా



నెల్లూరు (టౌన్‌): జేఈఈ మెయిన్స్‌ ఫలితాల్లో కృష్ణచైతన్య జూనియర్‌ కళాశాలల విద్యార్థులు విజయభేరి మోగించారని కళాశాల చైర్మన్‌ కృష్ణారెడ్డి, డైరెక్టర్‌ రాణాప్రమోద్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని కళాశాలలో విద్యార్థులను శనివారం అభినందించిన అనంతరం వారు మాట్లాడారు. జాతీయ స్థాయిలో నిర్మల్‌తేజ 274వ ర్యాంక్‌ను సాధించారని చెప్పారు. అభినవ్‌రెడ్డి 98.75, అజోసైఫీ 98.23, సాయికేతన్‌రెడ్డి 96.76, మానిక 96.44 పర్సంటైల్‌ను సాధించారన్నారు.

'శ్రీచైతన్య' హవా



నెల్లూరు (టౌన్‌): జేఈఈ మెయిన్స్‌ ఫలితాల్లో శ్రీచైతన్య జూనియర్‌ కళాశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ఏజీఎం శ్రీరామ్‌ తెలిపారు. అన్నమయ్య సర్కిల్లోని కళాశాలలో విద్యార్థులను శనివారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. జాతీయస్థాయిలో స్వరూప్‌ 99.71, సామ్యశ్రీ 98.81, ఉషశ్రీ 95.10, పవన్‌ 93.48, దినేష్‌ 93.08 పర్సంటైల్‌ను సాధించారని వెల్లడించారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో గల దామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌లో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్‌ ఇంజినీర్లు శనివారం తెలిపారు. మూడు యూనిట్లలో వరుసగా 260.. 270.. 245 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారని చెప్పారు.

ఆగ్రహానికి గురై చేతి కడియంతో దాడి

నెల్లూరు(క్రైమ్‌): వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడిపై కేసును సంతపేట పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సంతపేటలోని బుజ్జమ్మరేవులో నివాసం ఉంటున్న కమల్‌.. పాలిష్‌ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. మద్యాన్ని ఎందుకు తాగుతున్నారంటూ ఆయన్ను భార్య గురువారం రాత్రి నిలదీశారు. ఇంతలో అటుగా వెళ్తున్న చలం, గొడవలేంటి అని ప్రశ్నించగా, అక్కడి నుంచి వెళ్లాలని కమల్‌ సూచించారు. దీంతో ఆగ్రహానికి గురైన నిందితుడు చేతి కడియంతో కమల్‌పై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు

పెద్దవి: రూ.90 సన్నవి: రూ.65
పండ్లు: రూ.40

పౌల్ట్రీ ధరలు

బ్రాయిలర్‌:	రూ.105
లేయర్‌	రూ.100
బ్రాయిలర్‌ చికెన్‌:	రూ.194
స్కిన్‌లెస్‌ చికెన్‌:	రూ.214
లేయర్‌ చికెన్‌:	రూ.170



కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు





వీక్షిస్తున్న భక్తులు

కల్యాణం.. కమనీయం

మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణాన్ని నేత్రపర్వంగా శనివారం నిర్వహించారు. అభిషేకాలు, పూలంగిసేవను జరిపారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్య కల్యాణ మండపంలో కొలువుదీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. తదుపరి వేదపండితుల మంత్రోచ్ఛారణలతో కల్యాణాన్ని నయనానందకరంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ఊంజల్‌సేవను సహస్రదీపాలంకరణ మండపంలో జరిపారు. – రాపూరు

బధిరుల సంఘ జిల్లా సమావేశం



నెల్లూరు(బృందావనం): జిల్లాలో బధిరుల సంక్షేమం, అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని బధిరుల సంఘ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్వరరావు తెలిపారు. నగరంలోని పురమందిరంలో బధిరుల సంఘ జిల్లా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం పలు అంశాలను లిఖితపూర్వకంగా ఆయన తెలియజేశారు. బధిరులకు సేవలను విస్తృతంగా అందిస్తున్నామని వివరించారు. సంఘం ఏర్పడి 35 ఏళ్లయిన సందర్భంగా సమావేశాన్ని నిర్వహించామని చెప్పారు. నూనె మల్లికార్జునయాదవ్‌, మన్నేపల్లి పెంచలరావు, గాదిరాజు రామకృష్ణ, చిలకా రామకృష్ణ, కుమార్‌, మల్లికార్జున, సంఘ నేతలు మస్తానయ్య, ప్రవీణ్‌, నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువకుల హల్‌చల్‌

కొడవలూరు: గంజాయి మత్తులో కొందరు యువకులు నార్తురాజుపాళెంలోని ఓ దుకాణంలో శుక్రవారం రాత్రి హల్‌చల్‌ చేశారు. వివరాలు.. స్థానికంగా ఉన్న ఓ కళాశాలలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు అతిథులుగా 'శుభం' చిత్ర బృందం హాజరైంది. ఎలాంటి అనుమతుల్లేకపోయినా కార్యక్రమానికి వెళ్లాలనే ఉద్దేశంతో గంజాయి మత్తులో వచ్చిన సదరు యువకులు సమీపంలోని దుకాణంలో తిష్ట వేశారు. వీరి వ్యవహారాన్ని గమనించిన దుకాణ యజమాని అక్కడి నుంచి వెళ్లాలని సూచించారు. దీంతో ఆగ్రహానికి గురైన వారు దుకాణ యజమానిపై దాడి చేసేందుకు యత్నించారు. పరిస్థితిని గుర్తించిన స్థానికులు వారిని అడ్డుకోవడంతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద కత్తులున్నాయని సమాచారం. అయితే ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచి విచారణ జరుపుతున్నారని తెలుస్తోంది. నార్తురాజుపాళెంలో గంజాయి విచ్చలవిడిగా లభ్యమవుతోందనే ప్రచారానికి శుక్రవారం రాత్రి చోటుచేసుకున్న ఉదంతం బలం చేకూర్చింది.

పన్నుల ఆదాయం.. అభివృద్ధికే



నెల్లూరులో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్‌ ర్యాలీ

నెల్లూరు సిటీ: రాష్ట్రంలో పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని అభివృద్ధి పనులకు వెచ్చించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారని రాష్ట్ర మున్సిపల్‌ శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్‌ కార్యక్రమంలో భాగంగా నగరంలోని వీఆర్సీ సెంటర్‌ నుంచి నర్తకి సెంటర్‌ వరకు ర్యాలీని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నెలకో థీమ్‌తో ముందుకెళ్తున్నామని, దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలనేదే లక్ష్యమని చెప్పారు. రానున్న అక్టోబర్‌ నాటికి చెత్త రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. నుడా చైర్మన్‌ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మేయర్‌ స్రవంతి, డిప్యూటీ మేయర్‌ రూప్‌కుమార్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో క్యాంపస్‌ డ్రైవ్‌

వెంకటాచలం: ఎంబీఏ విద్యార్థుల కోసం క్యాంపస్‌ డ్రైవ్‌ను విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో శనివారం నిర్వహించారు. రిలయెన్స్‌ రిటైల్‌ లిమిటెడ్‌ ప్రతినిధులు హాజరై 25 మందిని ఇంటర్వ్యూ చేయగా, పది మంది ఎంపికయ్యారు. వీరికి త్వరలోనే రిలయెన్స్‌ రిటైల్‌ సంస్థ డిపార్ట్‌మెంట్‌ స్టోర్‌ మేనేజర్‌ హోదాలో ఉద్యోగాలను కల్పించనున్నారు.

24న వాహనాల వేలం

నెల్లూరు రూరల్‌: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించి శిథిలావస్థకు చేరిన వాహనాల ఈ వేలాన్ని ఈ నెల 24న నిర్వహించనున్నామని డీఎంహెచ్‌ఓ సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు, షరతులు, తదితరాలపై konugolu.ap.gov.inను సంప్రదించాలని సూచించారు.

కరేడులో భారీ చోరీ

- ఐదు సవర్ల బంగారం, ఆరు కిలోల వెండి అపహరణ

ఉలవపాడు: తాళమేసిన ఇంట్లోకి దొంగలు చొరబడి బంగారం, వెండి ఆభరణాలను అపహరించిన ఘటన మండలంలోని కరేడులో శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం చేస్తున్న తన కుమారుడి వద్దకు గ్రామానికి చెందిన ఆళ్ల చంద్రావతి రెండు రోజుల క్రితం వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువాలోని సుమారు ఐదు సవర్ల బంగారం, ఆరు కిలోల వెండి వస్తువులను దొంగిలించారు. తలుపు తీసి ఉండటాన్ని గమనించిన స్థానికులు.. చంద్రావతికి తెలియజేశారు. ఆమె వచ్చి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సై అంకమ్మ తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు.

అర్ధాంతరంగా ఆగిన వివాహం

- ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారంటూ విలపించిన వధువు
- స్పందించిన సెక్యూరిటీ గార్డులు
- అన్నవరం కొండపై ఘటన

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీర వెంకటసత్యనారాయణస్వామి దేవస్థానంలో ఓ వివాహం శనివారం తెల్లవారుజామున అర్ధాంతరంగా ఆగిపోయింది. రామాలయం వద్ద గల విశ్రాంతి మండపంలో జరుగుతున్న ఓ వివాహంలో వధువు విలపించడంతో అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ గార్డులు ప్రశ్నించారు. తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని ఆమె తెలిపారు. తన వయస్సు 22 ఏళ్లని, తన కంటే 20 ఏళ్లు పెద్దయిన వ్యక్తితో వివాహం జరిపిస్తున్నారని విలపించారు. దీంతో వివాహాన్ని సెక్యూరిటీ గార్డులు నిలిపేసి.. వధూవరులు, ఇరువైపులా పెళ్లి పెద్దలను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ వధువును ఎస్సై శ్రీహరిరాజు ప్రశ్నించగా, తనకు ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని, పెళ్లి కొడుకు వయస్సు 42 ఏళ్లని చెప్పారు. అమ్మాయికి ఇష్టం లేని పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమని చెప్పి, వధూవరుల కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్‌ ఇచ్చి పంపేశారు. వివాహం చేసేందుకు అంగీకరించిన పురోహితుడ్ని మందలించారు. కాగా వధువుది జిల్లాలోని ఊటుకూరు కాగా, వరుడు కందుకూరుకు చెందినవారు. వీరిద్దరివీ వేర్వేరు సామాజికవర్గాలు. వధువు కుటుంబీకులు పేదవారు కావడంతో వేరే వర్గానికి చెందిన వ్యక్తితో వివాహం చేసేందుకు సిద్ధపడ్డారు. దీనిపై ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

నెల్లూరు(క్రైమ్‌): ఇంట్లో ఎవరూ లేని సమయంలో వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. భగత్‌సింగ్‌ కాలనీకి చెందిన చెంగయ్య (32) బుచ్చిరెడ్డిపాళెంలోని చేపల ఫ్యాక్టరీలో ప్యాకింగ్‌ పనులు చేస్తుండగా, భార్య నాగభూషణమ్మ రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకోసాగారు. ఈ క్రమంలో మద్యానికి బానిసై చెంగయ్య అప్పులపాలవడంతో దంపతుల నడుమ మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ తరుణంలో భార్య తన ఇద్దరు పిల్లలతో కలిసి సమీపంలోని పుట్టింటికి శుక్రవారం వెళ్లారు. దీంతో ఇంట్లోని ఇనుప దూలానికి చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు చెంగయ్య పాల్పడ్డారు. ఇంటి నుంచి పెద్దగా టీవీ శబ్దం వస్తుండటంతో పక్కింటివారు లోపల ఎవరని అడిగినా సమాధానం కరువైంది. దీంతో వారు నాగభూషణమ్మకు ఫోన్‌ చేసి విషయాన్ని తెలియజేశారు. ఇంటికి చేరుకొని లోపలికెళ్లిచూడగా, భర్త ఉరేసుకొని ఉండటంతో కన్నీటిపర్యంతమయ్యారు. దీనిపై నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి ఎస్సై శివయ్య చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని జీజీహెచ్‌ మార్చురీకి తరలించారు. పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబసభ్యులకు శనివారం అప్పగించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్‌

నెల్లూరు(క్రైమ్‌): మద్యం మత్తులో వ్యక్తిని హత్య చేసిన ఘటనలో నిందితుడ్ని వేదాయపాళెం పోలీసులు అరెస్ట్‌ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వేదాయపాళెనికి చెందిన టెంపో ట్రావెల్స్‌ నిర్వాహకుడు అల్లాబక్షు (47) తన ఇంటికి టిఫిన్‌ తీసుకెళ్లేందుకు గానూ అయ్యప్పగుడి సమీపంలోని భగవాన్‌ టిఫిన్‌ సెంటర్‌కు ఈ నెల 16వ తేదీ రాత్రి వెళ్లారు. ఇదే సమయంలో రంగనాయకులపేట గొల్లవీధికి చెందిన ఇషాక్‌ పూటుగా మద్యం తాగి అక్కడికొచ్చారు. టిఫిన్‌ విషయంలో వీరి మధ్య మాటామాటా పెరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన ఇషాక్‌ తన వద్దనున్న కత్తితో అల్లాబక్షు ఛాతిలో పొడిచారు. గాయపడిన అల్లాబక్షు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందారు. మృతుడి భార్య సుభహాని ఫిర్యాదు మేరకు కేసును పోలీసులు నమోదు చేశారు. నిందితుడి కోసం గాలింపు చర్యలను ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌ రోశయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం చేపట్టింది. ఈ తరుణంలో తిక్కన పార్కు సమీపంలో నిందితుడ్ని శుక్రవారం రాత్రి అరెస్ట్‌ చేశారు.

భార్య, మామపై దాడి

నెల్లూరు(క్రైమ్‌): భార్య, మామపై దాడి చేసిన వ్యక్తిపై కేసును చిన్నబజార్‌ పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఉమ్మారెడ్డిగుంటకు చెందిన సమీన్‌కు కోటమిట్టకు చెందిన అఫ్సర్‌తో 2024లో వివాహమైంది. ఆపై కొద్దిరోజులకే వీరి మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. భార్య ఫిర్యాదు మేరకు అఫ్సర్‌పై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే భర్త నుంచి విడిపోయేందుకు గానూ ఖాజీ కోర్టులో ఆమె దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయమై తన తండ్రి గౌస్‌బాషాతో కలిసి కోర్టుకు ఈ నెల పదిన ఆమె వెళ్లారు. అక్కడ భార్య, మామపై అఫ్సర్‌ దాడి చేశారు. గాయపడిన వీరు ఆస్పత్రిలో చికిత్స పొందారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.